# “ భారత మాజీ రాష్ట్రపతి డా॥ అబ్దుల్‌కలాం గారితో పంజాబ్ లోని రోపర్ లో యువ విద్యార్థుల భేటీ ”

**- “దేశం కోసం ఓటు వేద్దాం”**

మార్చి 20, 2014 న నేను విద్యార్థులతో ముఖాముఖి కోసం పంజాబ్ లోని రోపర్ కి వెళ్ళాను. పెద్ద మొత్తంలో యువతీ, యువకులు అక్కడ గుమికూడారు. నేను ఉపన్యాసించాల్సిన వేదిక మీదికి వెళ్తూ ఉండగా, ఇద్దరు అమ్మాయిలు, నలుగురు అబ్బాయిలు ఉన్న విద్యార్థి బృందం, నాదగ్గరికి వచ్చారు. వారు వివిధ రాష్ట్రాలకి చెందినవారు. నేను మాట్లాడే ముందు, వాళ్ళదగ్గరున్న ఒక ముఖ్యమైన ప్రశ్నకి సమాధానం చెప్పాల్సిందిగా నన్ను కోరారు. వాళ్ళు నా ముందుంచిన ప్రశ్న ఏంటంటే.

సార్, మేం దేశంలో ఎక్కడికెళ్ళినా సరే.. అది స్టడీ టూర్ అయినా కానీ, విహారయాత్ర అయినా కానీ, మరేదైనా కానీ, మేం ఆ ప్రదేశం లోని యువతని కలిసాం. చాలా మంది మా వయస్సు వాళ్ళే అంటే 16 నుండి 18 సంవత్సరాలు అంతకన్నా కాస్త ఎక్కువ వయస్సు వారే ! వారితో మేము ఓటు హక్కు గురించి మాట్లాడినప్పుడు, ఎక్కువ మంది మాతో చెప్పిందేంటంటే, వాళ్ళసలు ఓటు వెయ్యరట. కారణమేంటంటే, ఏఅభ్యర్థి కూడా, మెంబర్ ఆఫ్ పార్లమెంట్ గా లేక మెంబర్ ఆఫ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ గా వారికి నాయకత్వం వహించే అర్హత లేకపోవడమే మేం కూడా దీనితో ఏకీభవిస్తున్నాం, రాబోయే ఎన్నికల్లో ఓటు వేయకూడదని నిర్ణయించుకున్నాం. సార్, మేం సరైన నిర్ణయం తీస్కున్నామో లేదో దయచేసి చెప్పండి.

దానికి బదులుగా నేను వారితో “మిత్రులారా, నేను మీతో పూర్తిగా ఏకీభవించను. 80 సంవత్సరాలు దాటిన నా వయసులో, నేను ఎన్నో పార్లమెంట్ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికలు చూశాను. ప్రతీ ఎలక్షన్ లో నేను సరైన అభ్యర్థికి ఓటు వేశాను. ప్రతీ ఎలక్షన్ లో ఎంతో మంది అభ్యర్థులు పోటీ చేస్తారు. కొన్నిసార్లు కొత్తవారు, చాలాసార్లు సిట్టింగ్ యం.పి. లు, యం.ఎల్.ఎ. లు పోటీ చేస్తారు. పోటీ చేస్తున్న అభ్యర్థుల్లోనే ఒకరికి సమాజానికి, వారు చేసిన మేలు, వారి పనిని చూసి, గమనించి మీరు ఉత్తమమైన అభ్యర్థికి ఓటు వేయాలి. చాలాసార్లు, ఆ అభ్యర్థి పోటీ చేస్తున్న నియోజకవర్గాన్ని పరిశీలిస్తే, వారు చేసిన పని మీకు తెలిసిపోతుంది. అలాగే అసెంబ్లీ లేదా పార్లమెంట్ లో వారి ప్రదర్శన ని కూడా కొలమానంగా తీసుకోవాలి. వారి ప్రదర్శన, పనికి సంబంధించిన సమాచారం, మీకు మీడియా లేదా ఇంటర్నెట్ ద్వారా కూడా తెలుస్తుంది. ఆ అభ్యర్థి పనితీరు ని బట్టి మీరు విశ్లేషించుకొని, ఉత్తమమైన, నిజాయితీ గల అభ్యర్థి ని ఎన్నుకొని వారికి ఓటు వేయండి.

గుర్తుపెట్టుకోండి మీ “ఓటు హక్కు” చాలా విలువైనది. దీన్ని వినియోగించడం అత్యంత అవసరం, మిమ్మల్ని పాలించే, మీ గురించి ఆలోచించే సరైన వ్యక్తిని ఎంచుకొని అసెంబ్లీకి లేదా పార్లమెంట్‌కి పంపించే అవకాశం, ఇది మీకిస్తుంది. దానర్థమేంటంటే, యువతగా, యువ పౌరులుగా రాష్ట్రంలో కాని, కేంద్రంలో కాని, సరైన ప్రభుత్వాన్ని, ఒక మంచి ప్రభుత్వాన్ని ఈ దేశానికి అందించడంలో సహాయం చేస్తారు. సరైన అభ్యర్థికి ఓటు చేస్తే, ఈ దేశం మీకు ఋణపడి ఉంటుంది.